# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 316 | పేజీలు: 4 | వెల: రూ.4/- | సోమవారం 13 జులై 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# కరవు సమస్యను జఠిలం చేయొద్దు

## నీళ్ల విషయంలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తానంటే ఊరుకునేది లేదు : హరీశ్‌రావు

## నీటి విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

## దమ్ముంటే నీళ్లు వదలాలని డిమాండ్



**హైదరాబాద్, జులై 12 (నమస్తే ఉదయం)**

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నీటి విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. దమ్ముంటే నీళ్లు వదలాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికే ఆధారం అంటున్న ప్రభుత్వం దాని విశ్వాసనీయత ఏపాటిదో తెలుసుకోవాలని హితావు పలికారు. 31 నెలలుగా ముఖ్యమంత్రిగా పని చేసినా రేవంత్ రెడ్డికి ఇంకా విషయం పరిజ్ఞానం పెరగలేదన్నారు. మొన్నటి వరకు నిపుణులుగా భావించిన ఇంజనీర్లే నేడు కిలేడి వాళ్లుగా కనిపిస్తున్నారా అని హరీశ్ రావు ప్రశ్నించారు. రైతుల కోసం నీళ్లు అడిగితే సీఎం తమ రక్తం అడుగుతున్నారని అయినా సరే తమ రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. నీళ్ల విషయంలో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తానంటే ఊరుకునేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ కటిక నొక్కమంటే విపక్షాల కంఠం నొక్కుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాల మీద ఉన్న శ్రద్ధ రైతుల పంటల మీద లేదన్నారు. మేడిగడ్డ మీద సీఎం రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అవాస్తవాలని విమర్శించారు. సీఎంగా 31 నెలలు పూర్తయినా, కాళేశ్వరంపై రేవంత్ రెడ్డికి అవగాహన రాలేదని ఎద్దేవా చేశారు. నీళ్లు ఎత్తిపోయవచ్చని విశ్రాంత ఇంజినీర్లు చెప్తున్నారన్న హరీశ్‌రావు మేడిగడ్డ వద్ద కాపర్ డ్యామ్ నిర్మించి నీళ్లు ఎత్తిపోయవచ్చని ఇంజినీర్లు చెప్పారని తెలిపారు. రూ.8.50 కోట్లతో కాపర్ డ్యామ్ నిర్మించి నీళ్లు ఎత్తిపోయవచ్చని, వాస్తవాలు మాట్లాడిన వారిని జైలులో పెడతానంటూ భయపెడుతున్నారని, ఎల్లంపల్లి ప్రాజెక్టు మీద హైదరాబాద్ సహా అనేక జిల్లాలు ఆధారపడ్డాయని పేర్కొన్నారు. ఎల్లంపల్లి మీద ఆధారపడి రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రం పని చేస్తోందని అన్నారు. రాజకీయాలకు పోయి కరవు సమస్యను జఠిలం చేయొద్దని సూచించారు.

**ధాన్యం ఉత్పత్తి 2.60 లక్షల కోట్ల టన్నులు :** బీఆర్ఎస్ పదేళ్లలో కొత్తగా 48 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిందని, మహబూబ్‌నగర్ జిల్లాలో 6 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని తెలిపారు. కల్వకుర్తికి నీళ్లు తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. 2014లో తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నులు మాత్రమేనని, 2023 నాటికి ధాన్యం ఉత్పత్తి 2.60 లక్షల కోట్ల టన్నులకు పెరిగిందని వెల్లడించారు.

**రాజ్‌కుమార్‌కు, సీఎంకు మధ్య తేడా లేదు :** సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు. హిట్లర్ తనకు ఆదర్శమని ఇప్పటికే రేవంత్ రెడ్డి అన్నారని గుర్తు చేశారు. చెప్పేందుకు విషయం లేకనే రేవంత్ రెడ్డి బూతులకు దిగారని, జారుడుబండపై ఉన్నందునే రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని అన్నారు. షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన రాజ్‌కుమార్‌కు, సీఎంకు మధ్య తేడా లేదని విమర్శించారు. షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డి ఇప్పటికీ స్పందించలేదని, ప్రశ్నించిన వాళ్ల రక్తం పారిస్తానని సీఎం అంటున్నారని ఆరోపించారు.





# ఇరాన్‌పై అమెరికా దాడులు

## కువైట్..బహ్రెయిన్‌లపై ఇరాన్ ప్రతీకార దాడులు

**టెహ్రాన్, జులై 12 (నమస్తే ఉదయం)**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. సైప్రస్ జెండాతో హర్మూజ్‌లో అనధికార మార్గంలో ప్రయాణిస్తున్న ఓ నౌకపై తమ సైన్యం కాల్పులు జరిపిందని.. ఈ జలసంధిని మరోసారి మూసివేస్తునట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ దాడి కారణంగా నౌకలోని ఒక సిబ్బంది మృతి చెందినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. ఇరాన్ ఓ తప్పుడు నిర్ణయం తీసుకుందని.. దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుందని అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ హెచ్చరించారు. దీంతో టెహ్రాన్‌పై అమెరికా దాడులు కొనసాగించే అవకాశం ఉందని పశ్చిమాసియా దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హర్మూజ్ తీరంలోని రెండు పట్టణాలపై అమెరికా విరుచుకుపడంతో 10 చోట్ల భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ వెల్లడించింది. కాగా టెహ్రాన్‌పై మూడో విడత దాడులు పూర్తి చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. మొత్తం 140 టార్గెట్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. బుషెహర్ ప్రావిన్స్‌పై జరిపిన దాడుల్లో ఒక సైనిక స్థావరంతో సహా పలు ప్రాంతాలు దెబ్బతిన్నట్లు సమాచారం. తాజా దాడులతో ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయని ప్రభుత్వ మీడియా వర్గాలు వెల్లడించాయి. టెహ్రాన్‌పై దాడులకు ప్రతీకారంగా కువైట్... బహ్రెయిన్, ఖతార్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై డ్రోన్ దాడులు చేపట్టినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. కువైట్.. బహ్రెయిన్ లలోని యూఎస్ వైమానిక రక్షణ వ్యవస్థలు, ఆయుధ డిపో, రాడార్ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ దాడులతో ...మిగతా 2లో



## హర్మూజ్‌లో హైటెన్షన్

### ఖతార్ కీలక నిర్ణయం

2

## మీ రక్తదాహం తీర్చుకోండి. కానీ..

# రైతులకు మాత్రం నీళ్లివ్వండి

### ఎన్‌కౌంటర్ల పేరుతో పిట్టల్లా కాల్చారు.. కేటీఆర్



**హైదరాబాద్, జులై 12 (నమస్తే ఉదయం)**

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేరుతో తెలంగాణ పిల్లలని కాల్చి చంపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ బిడ్డల రక్తంతో కాంగ్రెస్ చేతులు తడిచాయన్నారు. నెత్తురు ఇస్తేనే నీళ్లిస్తామంటే అందుకు తాము సిద్ధమని.. మీ రక్తదాహం తీర్చుకొని పొలాల జలదాహం తీర్చండన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి చేసిన రక్తం వ్యాఖ్యలపై కేటీఆర్ ...మిగతా 2లో

## కాళేశ్వరం పునరుద్ధరణలో

# కాంగ్రెస్ విఫలం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**



2

# ఇప్పుడు పార్టీ పేరు మార్చుమంటే ఎలా?

### 105 నియోజకవర్గాల్లో జెండా ఎగరేశాం

## టీఆర్ఎస్ పార్టీకి గుర్తింపునివ్వండి: కవిత

### ఎన్నికల సంఘానికి కవిత లేఖ



**హైదరాబాద్, జులై 12 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రక్షణ సేన పార్టీకి గుర్తింపునివ్వాలని ఆ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈనెల 7వ తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు తాజాగా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కవిత రిప్లయ్ ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి హోదాలో అనిల్ కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌తో ఎన్నికల కమిషనర్‌లకు లేఖ రాశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరును తమకు కేటాయిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 28న లేఖ ద్వారా సమాచారం ఇచ్చిందని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తమకు తెలంగాణ రక్షణ సేన పార్టీ తమకు కేటాయించడంతో తెలంగాణ వ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించుకోవడంతో పాటు పార్టీ నిర్మాణ పరమైన ఇతర కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ జూన్ 23న తమకు లేఖ రాస్తూ తెలంగాణ రక్షణ సేన పార్టీ రిజిస్ట్రేషన్‌పై సుమారు వెయ్యి అభ్యంతరాలు వచ్చాయని పేర్కొన్నారని వివరించారు. కానీ ఇంత వరకు ..మిగతా 2లో

# పవన్‌కు చంద్రబాబు పరామర్శ



**ముంబై, జులై 12 (నమస్తే ఉదయం)**

ఏపీ సీఎం చంద్రబాబు ముంబయి వెళ్లారు. అక్కడ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ను ఆయన పరామర్శించారు. పవన్ కుడి భుజానికి వైద్యులు శనివారం శస్త్రచికిత్స చేశారు. దీంతో చంద్రబాబు వెళ్లి ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చంద్రబాబు వెంట మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్ ఉన్నారు. పవన్‌ను పరామర్శించిన అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "పవన్ కుడి భుజానికి జరిగిన ఆపరేషన్ విజయవంతమైంది. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు ...మిగతా 2లో



## ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన

# జానకి అంత్యక్రియలు

**వేలాదిగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికిన అభిమానులు**

**మైసూరు, జులై 12 (నమస్తే ఉదయం)**

ప్రముఖ గాయని, 'గాన కోకిల' ఎస్. జానకి అంతిమ యాత్ర ముగిసింది. ఆదివారం ఆమె అంత్యక్రియలు కర్ణాటక ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగాయి. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకాలోని ఆమె వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులు, అభిమానుల అశ్రునయనాల మధ్య తుది సంస్కారాలు నిర్వహించారు. జానకమ్మ ...మిగతా 2లో



## కిరాతకుడు రాజ్‌కుమార్ ఆచూకీపై

# వీడని సస్పెన్స్!

### రైలెక్కి పారిపోయాడని నిర్ధారించిన పోలీసులు

### నిందితుడి కోసం 12 ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు

**హైదరాబాద్, జులై 12 (నమస్తే ఉదయం)**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌ను ఉలిక్కిపడేలా చేసిన ఆరుగురి వరుస హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ, పక్కా ప్రణాళికతోనే రైలెక్కి పారిపోయాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని పట్టుకునేందుకు సుమారు 10 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి, గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఘోర హత్యాకాండకు పాల్పడిన తర్వాత రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసి చనిపోతానని చెప్పడంతో అతను ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని మొదట భావించారు. అయితే, నందిగామ సమీపంలో నిందితుడి కారును, మొబైల్ సిగ్నల్‌ను పోలీసులు గుర్తించారు. ...మిగతా 2లో



# కాళేశ్వరం పునరుద్ధరణలో కాంగ్రెస్ విఫలం

**హైదరాబాద్, జులై 12 (నమస్తే ఉదయం)**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ ఆలస్యంతో రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఆదివారం కాళే శ్వరం ప్రాజెక్టు అంశమై సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. NDSA సిఫారసులను సకాలంలో అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యం చెందిందని 2024, 2025, 2026లో మూడు పూర్తి వర్కింగ్ సీజన్లు ఉన్నా పునరుదరణ పనులు పూర్తి చేయలేదన్నారు. రాంచందర్ రావు లేఖలో "200 టీఎంసీల గోదావరి నీటిని వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కోల్పో యింది. NDSA ఇప్పటికే సమగ్ర పరీక్షలు, సాంకేతిక పరిశీలనలు, పునరుద్ధరణ చర్యలు సూచించినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ కేవలం సాంకేతిక మార్గదర్శకత్వానికేనని, అమలు బాధ్యత మాత్రం రాష్ట్ర ప్రభుత్వానిదే NDSA కమిటీపై బాధ్యత నెట్టడం ద్వారా సీఎం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారుఅన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు తక్కువ నష్టం జరిగిందని, వాటిని ముందే పునరుద్ధరిస్తే ఉత్తర తెలంగాణకు నీరు అందేది. 20–25 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణకు తాగునీరు అందించే అవకాశం కోల్పోయింది." అన్నారు. విజిలెన్స్ కమిటీ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని, విజిలెన్స్ నివేదికలో సూచించిన వారిపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో ప్రభుత్వం హైకోర్టులో సమర్థంగా వాదించలేదు.బీఆర్ఎస్ పెద్దలను కాపాడేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. CBI విచారణకు కేవలం మూడు బ్యారేజీల అంశానికే పరిమితమైన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఇచ్చారన్నారు. రూ.1.30 లక్షల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తంపై విచారణకు ఎందుకు వెనుకాడుతున్నారని.. పంప్ హౌస్‌లు, కాల్వలు, టన్నెల్లు, రిజర్వాయర్లు సహా మొత్తం ప్రాజెక్టుపై CBI విచారణ జరగాలని రాంచందర్ రావు లేఖలో పేర్కొన్నారు.



# ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన జానకి అంత్యక్రియలు

మొదటి పేజీ తరువాయి

మనవరాలు అప్సర వైద్యుల తుది కర్మలు జరిపించారు. అంతకుముందు, జానకమ్మ పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో ఉంచారు. తమ అభిమాన గాయనిని కడసారి చూసేందుకు అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు వేలాదిగా తరలివచ్చారు. భారతీయ సంగీతానికి ఆమె చేసిన సేవలను గౌరవిస్తూ, పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు.వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న 88 ఏళ్ల జానకి, శనివారం మైసూరులోని అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన అద్భుత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ సహా 20కి పైగా భాషల్లో 48,000కు పైగా పాటలు పాడి ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె విశిష్ట గాత్రానికి నాలుగు జాతీయ పురస్కారాలు కూడా లభించాయి. జానకి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భౌతికంగా దూరమైనా, తన గాత్రంతో ఎప్పటికీ జీవించే ఉంటారని అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు.

# కిరాతకుడు రాజ్‌కుమార్ ఆచూకీపై వీడని సస్పెన్స్!

మొదటి పేజీ తరువాయి

అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా, అతను కారును వదిలేసి నందిగామ రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు స్పష్టమైంది. దీంతో రైల్వే స్టేషన్‌లోని దృశ్యాలను విశ్లేషిస్తున్న పోలీసులు, అతను ఆత్మహత్య చేసుకోలేదని, తప్పించుకునేందుకే రైలు మార్గాన్ని ఎంచుకున్నాడని తేల్చారు.

**పోలీసుల నిర్లక్ష్యమే కొంపముంచిందా?**

ఈ దారుణానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. గతంలో ఓ మైనర్ బాలికను వేధించిన కేసులో పోక్సో చట్టం కింద అరెస్టయిన రాజ్‌కుమార్, జైలు నుంచి విడుదలయ్యాక కక్ష పెంచుకున్నాడు. 'మీ అంతు చూస్తా' అంటూ బాధితుల కుటుంబాన్ని బెదిరించాడు. ఈ విషయంపై వారు స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కన్నీరుమున్నీరవుతున్నారు. "అతడే భయపడుతున్నాడు. మీరేం కంగారు పడొద్దు" అని కేసు దర్యాప్తు అధికారి అయిన ఎస్సై రమేశ్ తేలిగ్గా తీసిపారేసినట్లు బాధితులు వాపోతున్నారు. వారి ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించని కారణంగానే శనివారం ఈ ఘోరం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు మొదట బాలిక, ఆమె తల్లి, నానమ్మను దారుణంగా నరికి చంపి, ఆ తర్వాత తన భార్య, ఇద్దరు పిల్లలను కూడా హతమార్చాడు. ఈ ఆరోపణల నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు షాబాద్ ఎస్సై రమేశ్‌ను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి తక్షణమే సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నిందితుడు ఏ రైలు ఎక్కాడు, ఎక్కడికి పారిపోయాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# పవన్‌కు చంద్రబాబు పరామర్శ

సూచించాను. పవన్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి. వైద్యులు మూడు వారాలు విశ్రాంతి అవసరమని చెప్పారు. ఆయన రెండో భుజానికీ సమస్య ఉంది. దానికి ఆపరేషన్ చేయాలా?ఫిజియో థెరపీ సరిపోతుందా? అనేది వైద్యులు పరిశీలిస్తున్నారు'' అని చంద్రబాబు తెలిపారు. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి శనివారం సర్జరీ చేసింది. రొటేటర్ కఫ్ గాయంతో పాటు భుజానికి అవల్షన్ ఫ్రాక్చర్ ఉండటంతో ఈ శస్త్రచికిత్స అవసరమైంది. మరికొన్ని రోజుల తర్వాత ఎడమ భుజానికీ శస్త్రచికిత్స చేయనున్నారు. ఏప్రిల్‌లో పవన్ కల్యాణ్ ముక్కుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంలో పలు వైద్య పరీక్షలు చేశారు. అప్పుడే భుజాలకు రొటేటర్ కఫ్ గాయాలు, మజిల్ టేర్స్ తీవ్రస్థాయిలో ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వీలైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. దీంతో పవన్ ముంబయి వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

# హర్మూజ్‌లో హైటెన్షన్

## ఖతార్ కీలక నిర్ణయం

**టెహ్రాన్, జులై 12 (నమస్తే ఉదయం)**

దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కీలకమైన హర్మూజ్ జలసంధిని (Strait of Hormuz) మరోసారి మూసివేసినట్లు ఇరాన్ (Iran) ప్రకటించడం, నౌకలపై దాడులు చేస్తుండటంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో గల్ఫ్ దేశం ఖతార్ (Qatar) కీలక నిర్ణయం తీసుకుంది. సముద్ర కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని వాణిజ్య నౌకల యాజమాన్యాలను ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వాణిజ్య, విహార నౌకలతోపాటు, చేపల బోట్లును కూడా నిలిపివేయాలని స్పష్టం చేసింది. ప్రజా భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

మరోవైపు ఖతార్ రాజధాని దోహాపై ఇవాళ ఉదయం ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వాటిలో కొన్నింటిని ఖతార్ రక్షణ వ్యవస్థ కూల్చివేసినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో కొందరు పౌరులకు తీవ్ర గాయాలైనట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సమర్థంగా తిప్పికొట్టేందుకు తమ సేనలు పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు ఖతార్ ప్రభుత్వం తెలిపింది.

**బాధ్యతారాహిత్యమైన చర్యలు: ఒమన్**

ఇరాన్ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఒమన్ మండిపడింది. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట తమ భూభాగంపై బాంబులు ప్రయోగించడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు ఒమన్‌లోని ఇరాన్



రాయబారికి సోషల్ మీడియా వేదికగా నిరసన తెలిపింది. ''ఇరాన్ బాధ్యతారాహిత్యమైన చర్యలపై ఒమన్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. దేశ సార్వభౌమాధికారం, పొరుగు దేశాలతో సత్సంబంధాలు, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం తదితర నిబంధనలకు కట్టుబడి ఉండటం అత్యంత అవసరం'' అని ఒమన్ ప్రభుత్వం అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. హర్మూజ్ జలసంధిపై చర్చల కోసం ఇరాన్ విదేశాంగ మంత్రికి ఒమన్ ఆతిథ్యం ఇచ్చిన మరుసటి రోజే ఈ ప్రకటన రావడం

# ఇప్పుడు పార్టీ పేరు మార్చమంటే ఎలా?

మొదటి పేజీ తరువాయి

ఆ అభ్యంతరాల్లో ఒక్కటి కూడా తమకు పంపలేదని తెలిపారు. అభ్యంతరాలు ఎవరు తెలిపారు?, ఆయా అభ్యంతరాల్లో ఏమి పేర్కొన్నారు?, అనే వివరాలు కూడా ఇవ్వలేదన్నారు. అసలు అభ్యంరాతలనే తమకు పంపకుంటే తాము సమాధానం ఎలా చెప్పగలమని అన్నారు.

**మాకు తీవ్ర నష్టం, అన్యాయం చేసినట్లే..**

తెలంగాణ రాష్ట్ర జనాభా మూడున్నర కోట్లు అని.. వెయ్యి అభ్యంతరాలు వచ్చాయనే సంఖ్యను చూపిస్తూ ఈసీ నిర్ణయం సరికాదన్నారు. అసలు అభ్యంతరాల వెనుక లీగల్ మెరిట్ ఏంటి అనేది పరిశీలించాలి? ఎవరైనా కావాలనే గ్రూపులుగా ఏర్పడి, ప్లాన్ ప్రకారం ఇదంతా చేయించారా? అనేది తమకు అబ్జెక్షన్ కాపీలు ఇస్తేనే తెలుస్తుంది. ఈసీ ఆమోదించిన పేరును నమ్ముకొని సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేసుకున్నామని.. ఇప్పుడు ఆ పేరును మార్చుకోవాలని అంటే అది తమకు తీవ్ర నష్టం, అన్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశించినట్టుగా తాము ఈసీ ఎదుట వ్యక్తిగత విచారణ హాజరవాడానికి ముందే తమ పార్టీపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను ఇవ్వాలని కోరారు. అప్పుడు మాత్రమే తాము సరైన సమాధానం చెప్పుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతిపాదిత "తెలంగాణ రక్షణ సేన" అనే పేరును మేము పూర్తి సదుద్దేశంతో స్వతంత్రంగా ఆలోచించి పెట్టిన పేరు అని వివరించారు. "తెలంగాణ రక్షణ సేన" అనే పేరుతో దేశంలో మరే ఇతర రాజకీయ పార్టీ కూడా నమోదు కాలేదని.. ఇది ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీ పేరును పోలి లేదని అన్నారు. రెండు పార్టీల పేర్ల మధ్య పోలికలను నిర్ధారించుకునేప్పుడు రాజకీయ పార్టీ యొక్క పూర్తి పేరును ఒకే సమగ్ర రూపంగా భావించాలని.. కానీ అందులోని విడి పదాలను ముక్కలు చేసి లేదా విడదీసి చూడకూడదన్నారు.

**మా పార్టీ పేరుకు ఏ పార్టీతోనూ పోలిక లేదు..**

ఎన్నికల కమిషన్ తమకు పంపిన అభ్యంతరాల్లోని “తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రాటిక్) (2024)”, “తెలంగాణ రాజ్య సమితి” (2023) అనేవి వేర్వేరు పేర్లు.. విభిన్న ఉచ్చారణ, నిర్మాణం, గుర్తింపు, నాయకత్వం, సంస్థాగత శైలి తో పాటు ప్రజల్లో వేర్వేరు గుర్తింపు కలిగిన రాజకీయ పేర్లు అని వివరించారు. ఆ పేర్లతో "తెలంగాణ రక్షణ సేన"ను దాని సమగ్ర రూపంలో పరిశీలించినప్పుడు, అది పూర్తి భిన్నంగా, స్పష్టంగా గుర్తించదగిన రాజకీయ పార్టీగా తెలుస్తోందన్నారు.. ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఏ గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీతోనూ



తమ పార్టీ పేరుకు పోలిక లేదన్నారు. గతంలో కూడా కేవలం ఒకే రకమైన భౌగోళిక వర్ణనాత్మక, సిద్ధాంతపరమైన పదాలు ఉన్నాయనే కారణంతో పార్టీ రిజిస్ట్రేషన్ నిరాకరించిన దాఖలాలు కూడా లేవని వివరించారు. ఒకే విధమైన పదాలతో సమాంతరంగా వేర్వేరు రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు దేశంలో వందల్లో ఉన్నాయని తెలిపారు. ఆమ్ ఆద్మీ, అఖండ్ భారత్, మక్కల్, ప్రజా సేవ, జన్ అధికార్, రాష్ట్రీయ జనతా, డెమోక్రాటిక్, సోషల్, రిపబ్లిక్ ఇండియా, శిరోమణి లాంటి పేర్లతో వందలాది పార్టీలు రిజిస్ట్రేషన్ పొంది ఉన్నాయన్న విషయం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపునిచ్చిన ఒకే విధమైన పేర్లు ఉన్న పార్టీల జాబితాను లేఖకు జత చేశారు. "తెలంగాణ రక్షణ సేన" పార్టీ పేరుపై వచ్చిన అన్ని అభ్యంతరాల కాపీలను, అలాగే తమకు వ్యతిరేకంగా ఉపయోగించాలనుకుంటున్న అన్ని ఆధారాలను తమకు అందజేయాలని కోరారు.



# మీ రక్తదాహం తీర్చుకోండి. కానీ.. రైతులకు మాత్రం నీళ్లివ్వండి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో మాట్లాడుతూ ఘాటుగా బదులిచ్చారు. కేటీఆర్ మాట్లాడుతూ" నీళ్ల అడిగితే నెత్తురు చల్లుతా అంటవా.. రక్త పిశాచీ! ఇంకా తీరలేదా మీ రక్తదాహం ? 60 ఏండ్లు పీడించి తెలంగాణ నెత్తురు తాగారు కదా..సరిపోలేదా? తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలు కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలి? తెలంగాణ పిల్లల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేసి ఎన్‌కౌంటర్ల పేరుతో నెత్తుటేళ్లు పారించిన నరహంతకులు మీరు! 1952లో ఏడుగురు యువకులను కాల్చిచంపి రక్తం కళ్ల జూశారు. 1969లో 369 మంది ముద్దుబిడ్డలపై తూటాలు కురిపించి రక్తం పారించిన ఖూనీకోర్లు మీరు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ చేతులు తెలంగాణ బిడ్డల రక్తంతో తడిచాయని మలిదశ పోరాటంలో వేయిమందిని బలితీసుకున్నారు. కాంగ్రెస్ రక్కసి కోరలకు తెలంగాణ నెత్తుటి మరకలు అంటినై..! మీకు మా రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తాం..కానీ, రైతులకు దయచేసి నీళ్లు ఇవ్వమని కేటీఆర్ విమర్శించారు.

తాము పేగులు తెగే దాకా రాష్ట్రం కోసం కొట్లాడిన వాళ్లమని రైతుల కోసం ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని తాము నీళ్లలో నిప్పులు పుట్టించి జలసాధన పోరాటాలు చేసిన వాళ్లమని నెత్తురు ఇస్తేనే.. నీళ్లు ఇస్తాం అని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతుంటే మా నెత్తురు ధార పోస్తామని కాంగ్రెస్ పార్టీనుద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు.

# ఇరాన్‌పై అమెరికా దాడులు

మొదటి పేజీ తరువాయి

హ్రైయిన్ అంతటా సైరన్‌లు మోగుతున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. దోహాలో భారీ పేలుళ్ల వినిపిస్తుండడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ప్రాంతీయ ఉద్రిక్తలల నేపథ్యంలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేస్తున్నట్లు గల్ఫ్ దేశాలు ప్రకటించాయి. క్షిపణి ముప్పును ఎదుర్కోవడానికి తమ గగనతల రక్షణ వ్యవస్థలు చురుగ్గా ప్రతిస్పందిస్తున్నాయని యూఏఈ వెల్లడించింది.

**అమెరికా యుద్ధ విమానాల నిర్వహణ కేంద్రంపైకి క్షిపణులు..**

ఖతార్‌లోని అల్ ఉదైద్ వైమానిక స్థావరంపై క్షిపణి దాడులు చేసినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఆ స్థావరంలోని యుద్ధ విమానాల నిర్వహణ కేంద్రం కమాండ్–అండ్–కంట్రోల్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసినట్లు పేర్కొంది. జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్ బేస్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపైనా క్షిపణులు ప్రయోగించినట్లు తెలిపింది. ఆ బేస్‌లోని కమాండ్–అండ్–కంట్రోల్ సెంటర్‌తో పాటు MQ-9 డ్రోన్‌లు ఉన్న హ్యాంగర్లను నాశనం చేశామంది. అయితే ఘటనలపై అమెరికా.. ఖతార్ అధికారుల నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు.

**దుఖ్మ్ ఓడరేవు లక్ష్యంగా దాడులు ..**

ఒమన్‌లోని దుఖ్మ్ ఓడరేవుపై ఇరాన్ భారీ దాడులు చేసింది. ఈ దాడుల్లో అమెరికా విమాన వాహక నౌకలు ఉపయోగించే లాజిస్టిక్స్ సహాయ కేంద్రాలు,



ఇంధనం నింపే కేంద్రాలు ధ్వంసమయ్యాయి. అమెరికా బాంబు దాడులకు స్పందనగా ఒమన్‌పై మూడో దశ దాడులు ప్రారంభించినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. కాగా దుఖ్మ్ భారత్‌కు కీలకమైన ఓడరేవు. ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున చమురు సరఫరా అవుతుంది.

**ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసింది: మహమ్మద్ ఘాలిబాఫ్**

ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసిందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. మాట నిలబెట్టుకోవాలని.. లేదంటే మూల్యం చెల్లించడానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఇక అమెరికాతో ఒప్పందంలోని అయిదో పాయింట్‌ను ఫొటోను ఆయన తన ఎక్స్ పోస్టుకు జత చేశారు.



# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు


**హైదరాబాద్, జులై 12 (నమస్తే ఉదయం)**

హైదరాబాద్‌కు టేకాఫ్ అయిన ఓ అంతర్జాతీయ విమాన సర్వీస్‌ను గగనతలంలోనే పేల్చేస్తామని ఈ– మెయిల్ సందేశం వచ్చిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారుల వివరాల ప్రకారం.. రియాద్ నుంచి ప్రయాణికులతో ఓ విమానం హైదరాబాద్‌కు బయలుదేరింది. గగనతలంలో ప్రయాణిస్తున్న ఆ విమానంలో బాంబులు ఉన్నాయని.. శంషాబాద్‌కు చేరుకోగానే పేల్చేస్తామని ఎయిర్‌పోర్ట్ కస్టమర్ సపోర్ట్‌కు గుర్తు తెలియని వ్యక్తి మెయిల్ పంపించాడు. రియాద్ విమానం శంషాబాద్‌లో ల్యాండింగ్ కాగానే భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. జీహెచ్ఐఏఎల్ అధికారుల ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విజయవాడ ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

**విజయవాడ, జులై 12 (నమస్తే ఉదయం)**

నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన బస్సులకు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం ఒక బస్సును నిలిపారు. ఆ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే పక్కన పార్క్ చేసి ఉన్న మిగతా ఆరు బస్సులకు కూడా మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.



# వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి భారతీయుడి గల్లంతు

**టెహ్రాన్, జులై 12 (నమస్తే ఉదయం)**

'' వాణిజ్య నౌక జీఎఫ్ఎస్ గెలాక్సీపై ఒమన్ తీరంలో దాడిచేయడాన్ని మేము ఖండిస్తున్నాం. దీనిలో ఉన్న 11 మంది భారతీయుల్లో 10 మందిని రక్షించారు. ఒకరి జాడ గల్లంతైంది. ఒమన్‌లోని మా దౌత్య కార్యాలయం పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తోంది. గాలింపు చర్యల్లో ఒమన్ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటోంది. ఒమన్ ప్రభుత్వం అందించిన సాయానికి ధన్యవాదాలు'' అని భారత విదేశాంగశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

హర్మూజ్ జలసంధిలో జీఎఫ్ఎస్ గెలాక్సీ నౌకపై ఇరాన్ దాడి చేయడంతో భారీగా మంటలు వ్యాపించాయి. దీంతో సిబ్బంది ఆ నౌకను వదిలేసి ఒక చిన్న లైఫ్‌బోట్‌లో బయటపడ్డారు. నౌక ఇంజిన్ రూమ్ తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనతో హర్మూజ్ జలసంధి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారిపోయింది. ఇరాన్‌లోని మొత్తం 140 లక్ష్యాలపై అమెరికా దాడులు చేసింది.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 1,14, 795 ఎన్యుమరేషన్ ఫారాలు ఆప్ లోడ్ చేసిన అధికారులు



పద్మశాలిపురం బస్తీలో ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్ ఏ వీ ఎం స్కూల్ ఆవరణలో ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు వై శ్రీధర్



గగన్ పహాడ్ లో ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు శీలం తిరుపతి రెడ్డి

**బుద్వేల్, జూలై 12 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆదివారం సాయం త్రం నాటికి 1,14,795 ఎన్యుమరేషన్ ఫారాలను ఆన్లైన్ లో అప్ లోడ్ చేసినట్లు నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ ఓ) సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజలు తీసుకున్న ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో నింపి, పాస్ పోర్ట్ సైజు ఫోటో పెట్టి బీఎల్ ఓ లకు ఇవ్వాలన్నారు. ఇప్పటి వరకు అత్తాపూర్ సర్కిల్ లో 45,391 ఎన్యుమరేషన్ ఫారాలను, శంషాబాద్ మండలంలో 28, 563, రాజేంద్రనగర్, నార్సింగ్ సర్కిల్లలో 29,996, గండిపేట్ మండలంలో 10, 845 ఎన్యుమరేషన్ ఫారాలను అప్ లోడ్ చేయడం జరిగిందన్నారు.



బాబుల్ రెడ్డి నగర్ లో సర్ కేంద్రం వద్ద కాంగ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, సరికొండ వెంకటేష్, ఎన్ ధనుంజయ



మైలార్ దేవుపల్లి డివిజన్ లో సర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**ప్రతి ఒక్కరు ఎన్యుమరేషన్ ఫారాలను అధికారులకు అందజేయాలి : ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ :**

మైలార్దేవుపల్లి డివిజన్ పద్మశాలిపురం బస్తీలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ కార్యక్రమాన్ని ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్ పరిశీలించారు. ఓటర్లు తాము తీసుకున్న ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో నింపి బీఎల్ఎలకు అందజేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైన తనను సంప్రదించాలన్నారు. కాటేదాన్ డివిజన్ బాబుల్ రెడ్డినగర్ లో కాంగ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, సరికొండ వెంకటేశ్, ఎన్ దనుంజయులు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.

**వివిధ ప్రాంతాలలో...**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం లో బీజేపీ నాయకులు వై శ్రీధర్, తోకల శ్రీనివాస్ రెడ్డి, సోమ శ్రీనివాస్ గుప్తా, శీలం తిరుపతి రెడ్డి, సరికొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంతో రైతులకు మేలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 12(నమస్తే ఉదయం)**

రైతాంగానికి అవసరమైన అన్ని రకాల సేవలు, సదుపాయాలు ఒకేచోట అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రైతు సేవా కేంద్రాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. కేటిదొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు సాగుకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేయాలని అన్నారు. చుట్టుపక్కల గ్రామాల రైతులందరూ అందుబాటులో ఉండే హాకా రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వహన్మంతు, నిర్వాహకుడు వెంకటపురం గోపి, తదితరులు పాల్గొన్నారు.





బోనం తీసుకెళ్తున్న మహిళలు

## పద్మశాలిపురంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

### అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించిన మహిళలు!

**రాజేంద్రనగర్, జూలై 12 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలర్దేవ్పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురంలో శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ నూతన ధ్వజస్తంభ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ పునరుద్ధరణలో భాగంగా నూతనంగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి అర్చకులు వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం మహిళలు నిష్ఠతో తయారు చేసిన సంప్రదాయ బోనాలను తలపై ఎత్తుకుని ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయంలో మంగళహారతులు, తీర్థప్రసాద వితరణతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ మహోత్సవానికి మైలార్దేవ్పల్లి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## నేడు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి పర్యటన

### రూ.1,775.51 కోట్ల అంచనా వ్యయంతో రహదారి పనులకు శంకుస్థాపనలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 12(నమస్తే ఉదయం):** హైదరాబాద్, జూలై 12: ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో రూ. 1,775.51 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారుల విస్తరణ, మరమ్మత్తు పనులకు రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం శంకుస్థాపన చేయనున్నారు పర్యటన సాగనుందిలా:- హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) ఫేజ్-1 కింద చేపట్టనున్న నాలుగు ప్యాకేజీల పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు నారాయణపేట జిల్లా మక్తల్లో రూ. 573 కోట్లతో మహబూబ్నగర్-1 ప్యాకేజీ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని గద్వాల--రాయచూర్ రహదారిపై రూ. 339.39 కోట్లతో మహబూబ్నగర్-2 ప్యాకేజీ పనులకు భూమి పూజ చేయనున్నారు మధ్యాహ్నం వనపర్తిలోని జడ్చర్ల రోడ్డులో రూ. 359.09 కోట్లతో వనపర్తి-2 ప్యాకేజీ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఎల్లూరు గ్రామం వద్ద కొల్లాపూర్--మొలచింతలపల్లి మార్గంలో రూ. 504.03 కోట్లతో వనపర్తి-1 ప్యాకేజీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

# వ్యవసాయ వర్శిటీ అధ్యాపకులకు అండగా టాసా పనిచేస్తుంది

**బుద్వేల్, జూలై 12 (నమస్తే ఉదయం)**

విశ్వవిద్యాలయం విద్యా మండలి ఆమోదించిన బదిలీ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అన్ని బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని, బదిలీ చేయబడిన ఉద్యోగులందరికి బదిలీ ప్రయాణ భత్యం ను ఎటువంటి జాప్యం లేకుండ ఇవ్వాలని తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) అధ్యక్షులు డాక్టర్ కె పవన్ చంద్రారెడ్డి కోరారు. రాజేంద్రనగర్ మానసహిల్స్ సమీపంలో గల నిర్వాణ హోటల్ లో ఆదివారం టాసా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక తీర్మాణాలను ప్రవేశ పెట్టారు. అధ్యాపకులకు అండగా టాసా పనిచేస్తుందన్నారు. సంఘం గత ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషి, ప్రభుత్వం, విశ్వవిద్యాలయ యాజమాన్యంతో నిర్వహించిన చర్చలు, సాదించిన విజయాలను వివరించారు. ఈ సం దర్భంగా అధ్యక్షులు డాక్టర్ కె పవన్ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య, ఉపాధ్యక్షులు డాక్టర్ జె కమలాకర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి రమేశ్, కోశాధికారి డాక్టర్ పి ప్రశాంత్ ల ఆధ్వర్యంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. పీజీ, పీహెచ్ఎ అర్హతలు కలిగిన ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పలు తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పీజీ, పీహెచ్డ్ అర్హత కలిగిన ఉద్యోగులకు మంజూరు చేసిన నాన్ కాంపౌండ్ అడ్వాన్స్ ఇంక్రిమెంట్లపై వచ్చిన ఆడిట్ అభ్యంతరాల పేరుతో పీఆర్సీ బకాయిలను జీతాల నుంచి ఎటువంటి రికవరీ చేయరాదన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం నుంచితగిన స్పష్టత వచ్చేవరకు ప్రతిపాధిత వసూళ్లను నిలిపివేయాలన్నారు. అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు, వివరణలు పొందేందుకు విశ్వవిద్యాలయం ఒకటి నుంచి రెండు సంవత్సరాల గడువు కల్పించాలన్నారు. కెరీర్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ (సీఏఎస్) కు సంబందించిన అన్ని దరఖాస్తులను అద్యాపకులు దరఖాస్తు చేసిన కాలంలో అమలు లో ఉన్న సీఏఎస్ స్కోర్ కార్డు సంబంధిత మార్గదర్శకల ప్రకారమే పరిశీలించి ఆమోదించాలన్నారు. సంఘం సమర్ధవంతంగా పనిచేయడానికి ఎన్నికైన టాసా కార్యవర్గ సభ్యులను వారి పదవీకాలంలో విశ్వవిద్యాలయం ప్రధన కార్యాలయంలోనే నియమించే విదంగా సంఘం ఉప నియమాలల తగిన సవరణలను చేయాలని కూడా ఏక గ్రీవంగా తీర్మాణం చేశారు. మహిళా ఉద్యోగులకు శిశు సంరక్షణ సెలవు (చైల్డ్ కేర్ లీవ్) విషయంలో ఏర్పడిన ఆడిట్ అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండ పరిష్కరించేందుకు చర్యలు తీసుకువెళ్లి ఉద్యోగులకు తీసుకోవాలన్నారు. కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ ఎం రమేశ్, డాక్టర్ అఫీఫా జహాన్ లు టాసా కార్యవర్గ సభ్యులుగా వర్శిటీ కి చెందిన డాక్టర్ ఎం రమేశ్ నాయక్, డాక్టర్ అఫీఫా జహాన్ లను నియమిస్తు సర్వసభ్య సమావేశంలో తీర్మాణం చేశారు.




టాసా సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కె పవన్ చంద్రా రెడ్డి. చిత్రంలో డాక్టర్ సల్లా సౌజన్య, డాక్టర్ కమలాకర్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రమేష్ లు



టాసా సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధ్యాకకులు



కూచిపూడి నృత్య కళాకారులతో మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్

## కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు అభినందనలు

**బుద్వేల్, జూలై 12 (నమస్తే ఉదయం):**

బాబుల్ రెడ్డినగర్ పోచమ్మ దేవాలయం, బీర లింగేశ్వర కళ్యాణ మండపం ఆవరణలో ఆదివారం అమృత కళాక్షేత్రం ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. వంగ శ్రీనాథ్ బాబు గౌడ్, అమృత పావని గౌడ్ ల నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్ పాల్గొని చిన్నారులను అభినందించారు. 20 సంవత్సరాలుగా అమృత కళాక్షేత్రం కూచిపూడి నృత్య శిక్షణ లో అనేక మందికి తర్ఫీదునిస్తున్న తీరు అభినందనీయమన్నారు. వివిధ రాష్ట్రాలలో ఈ కళాక్షేత్రం చిన్నారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి సంతుగౌడ్, అక్కెం శ్రీనాద్, శ్రీశైలం, పూజారి శివ, శేఖర్, శివకుమార్ లు పాల్గొన్నారు.



ధ్వజ స్తంభ పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ టి ప్రేమదాస్ గౌడ్ లు

## పద్మశాలిపురంలో ఘనంగా శ్రీ పోచమ్మ దేవాలయం ఆవరణలో ధ్వజ స్థంభ ప్రతిష్టాపన

**బుద్వేల్, జూలై 12 (నమస్తే ఉదయం)**

మైలారేవుపల్లి డివిజన్ పద్మశాలిపురం శ్రీ పోచమ్మ దేవాలయం ఆవరణలో ఆదివారం నూతన శిలామయ ధ్వజ స్థంభ పునః ప్రతిష్టాపన పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలలో పాల్గొనాలన్నారు. ఈ పూజలలో మాజీ కార్పొరేటర్ టి ప్రేందాస్ గౌడ్, తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### పద్మశాలిపురంలో ఘనంగా పోచమ్మ తల్లి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన - పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ , జూలై 12(నమస్తే ఉదయం)**

జిహెచ్ఎం సి అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని పద్మశాలిపురంలో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయ నూతన శిలామయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలను ఆలయ కమిటీ వారు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే శ్రీ టి. ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు. ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గారిని ఘనంగా సత్కరించారు. వందలాదిగా మంది అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు మైలార్దేవపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ టి. ప్రేమ్దాస్ గౌడ్ , స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు కాశీగారి యాదగిరి పోచయ్య, మునగపాటి వెంకటేశ్వర్లు యంజాల రాజు శేఖర్ బాలస్వామి , పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యతగా ఎస్ఐఆర్ ఫారాన్ని పూర్తి చేసి బీఎల్ఓలకు అందించాలి..

### రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,జులై12(నమస్తే ఉదయం)**



ప్రతి ఓటరు ఎస్ఐఆర్ పత్రాలను సామాజిక బాధ్యతగా తీసుకొని,ఫారాలను పూర్తి చేసి బీఎల్ఓలకు సమర్పించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పద్మశాలిపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బీఎల్ఓలతో కల్సి ఓటర్లకు ఎస్ఐఆర్ పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఓలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు అమూల్యమైనదని,ఓటు హక్కు కోల్పోతే ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని ఎమ్మెల్యే అన్నారు.ప్రతీ ఓటరుకు విధిగా ఎస్ఐఆర్ పత్రాలు పంపిణీ చేయాలని,క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.అలాగే ఓటర్లు కూడా ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్ ఫారం నింపి దగ్గరలో ఉన్న బిఎల్ఓలకు అందజేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.ఇది చాలా అత్యంత ముఖ్యమైన ప్రక్రియ కాబట్టి ప్రతి ఓటరు విధిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు.బిఎల్ వోల నుండి తీసుకున్న ఎమ్యూనరేషన్ పత్రాలను తిరిగి వారికి అందజేయడం లేదని,వాటిని పూర్తి చేసి తిరిగి బిఎల్ఓలకు అందజేసినప్పుడే ఓటు నమోదు అవుతుందని పేర్కొన్నారు.ఓటు హక్కును కోల్పోతే అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని,సంక్షేమ పథకాలను కోల్పోయే ప్రమాదం ఉందని తప్పనిసరిగా ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును కోల్పోకుండా చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు

# మెరిసే ఐటీ నగరం.. రోగాల కుంపటిగా మారిన వంటగది సామ్రాజ్యం!

## 'ఫైవ్ స్టార్' రేటింగ్స్.. 'జీరో స్టార్' హైజీన్!

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కోడింగ్ చూసి మురిసిపోతున్నాడు.. కానీ హోటల్ యజమాని వడ్డించే కుళ్ళిన కోడి మాంసం వెనుక ఉన్న ప్రమాదాన్ని గుర్తించలేకపోతున్నాడు.**

కంచంలో కలర్‌ఫుల్ బిర్యానీ కిచెన్ వెనుక మరుగుదొడ్ల కంపు! మనం తింటున్నది ఆహారమా? అంతానికి దారి తీసే విషమా?. హైటెక్ బోర్డులు చూసి మోసపోకండి అక్కడ రుచి వెనుక రోగం దాగి ఉంది. జిగేల్మనే లైటింగ్‌ల వెనుక జిడ్డు పట్టిన కిచెన్‌లు ఉన్నాయి! పేరు గొప్ప.. ఊరు దిబ్బ హైటెక్ సిటీ హోటళ్లలో 'హై-రిస్క్' భోజనం! నమస్తే ఉదయం ప్రత్యేక కథనం..










హైటెక్ సిటీలోని హోటల్స్ తనిఖీలు బయటపడ్డ కుళ్ళిన మాంసం కృతులు కిచెన్ పక్కనే మరుగుదొడ్లు ఫోటోలు..

**శేరిలింగంపల్లి : జూలై 12,(నమస్తే ఉదయం)**

కోట్లాది రూపాయల టర్నోవర్, ఆకాశాన్ని తాకే బహుళ అంతస్తుల భవనాలు, రాత్రిని పగలు చేసే జిగేల్మనే కాంతులు.. ఇదీ ప్రపంచ పటంలో ప్రత్యేక ముద్ర వేసుకున్న భాగ్యనగర ఐటీ హబ్ 'హైటెక్ సిటీ గచ్చిబౌలి' చిత్రం. అయితే ఈ తళతళలాడే గాజు మేడల వెనుక సాఫ్ట్‌వేర్ బాబుల పొట్ట కొడుతున్న ఒక చేదు నిజం ఇప్పుడు నిఘా బృందాల (ఫుడ్ సేఫ్టీ అధికారులు) తనిఖీల్లో బట్టబయలైంది. పైన చూస్తే ఫైవ్ స్టార్ రేటింగ్.. కిచెన్ లోపలికి తొంగి చూస్తే నరక ద్వారం! పేరు గొప్పగా చెప్పుకునే బడా రెస్టారెంట్లు నగర ప్రజల ఐటీ ఉద్యోగుల ఆరోగ్యంతో ఎంత క్రూరంగా ఆడుకుంటున్నాయో తాజాగా జరిగిన 'అల్సబా' ఫైర్ వాటర్ నియో బార్' తనిఖీలే సజీవ సాక్ష్యం.

**మరుగుదొడ్ల పక్కనే రుమాలి రొట్టెలు.. గడ్డకట్టిన కుళ్ళిన మాంసం!**

గచ్చిబౌలిలోని ప్రముఖ 'అల్సబా' రెస్టారెంట్‌లో జరిగిన తనిఖీలు చూస్తే ఎవరికైనా వాంతి రావడం ఖాయం. ఈగలు ముసురుతున్న కార్మికుల వాష్‌రూమ్‌ల పక్కనే సాఫ్ట్‌గా ఉండే రుమాలి రొట్టెలను తయారు చేస్తున్నారు. ఫ్రీజర్‌లలో మాంసం కుళ్ళిపోతున్నా పట్టించుకోని యాజమాన్యాలు వాటినే వేడి వేడి బిర్యానీలుగా మార్చి కస్టమర్ల ముందర వడ్డిస్తున్నారు. పాత్రలు కడిగేందుకు వేడి నీటి సదుపాయం లేదు సరే కదా కనీసం వాష్ ఏరియాలో నీరు నిల్వ ఉండి దోమలకి నిలయంగా మారింది. 150 మార్కులకు గాను ఈ హోటల్‌కు వచ్చింది కేవలం 69 మార్కులే (46 శాతం). అందుకే అధికారులు దీని ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌ను సస్పెండ్ చేసి, గేట్లు మూయించారు.

మరోవైపు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని 'ఫైర్ వాటర్ నియో బార్ అండ్ కిచెన్' కథ కూడా దాదాపు ఇంతే. ఎప్పుడు ప్యాక్ చేశారో తెలియని పీతలు, బోన్‌లెస్ చికెన్, రొయ్యలు ఫ్రీజర్‌లో మూలుగుతున్నాయి. గడువు ముగిసిన మష్రూమ్స్, నీటి నాణ్యత పరీక్షలు లేని ఐస్ ముక్కలు, కనీసం కడగని కోడిగుడ్లు ఇలా ప్రతి ఒక్కటీ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది.

**హైటెక్ ఉద్యోగులే టార్గెట్.. ప్లేటుకు వందలు, ఆరోగ్యానికి సున్నాలు!**

ఉదయం నుంచి రాత్రి వరకు సిస్టమ్స్ ముందు కూర్చుని తీవ్ర ఒత్తిడి ఎదుర్కొనే ఐటీ ఉద్యోగులు, వీకెండ్స్‌లో సేదతీరడానికి లేదా ఆకలి తీర్చుకోవడానికి ఈ రెస్టారెంట్లపైనే ఆధారపడుతున్నారు. ప్లేట్ బిర్యానీకి వందల రూపాయలు గుంజుతున్న ఈ హోటల్ వ్యాపారస్థులు, కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడంలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. మిగిలిపోయిన చికెన్‌ను, పాడైపోయిన గొర్రె మాంసాన్ని ప్రత్యేక కంటైనర్లలో ఉంచకుండా, మళ్ళీ మళ్ళీ ఫ్రీజ్ చేస్తూ, రసాయనాలు కలిపి వడ్డిస్తున్నారు. ఫుడ్ హ్యాండ్లర్లకు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేవు. అంటే వంట చేసే వాళ్లకు ఎలాంటి అంటువ్యాధులు ఉన్నాయో కూడా యాజమాన్యాలకు అనవసరం! వారికి కావాల్సింది కేవలం డబ్బులు మాత్రమే.

**ఆలోచించాల్సింది కస్టమర్లే.. మారాల్సింది వ్యవస్థే!**

ఈ తనిఖీలు కేవలం రెండు హోటళ్లతో ముగిసేవి కావు. హైటెక్ సిటీ వ్యాప్తంగా ఉన్న వందలాది ఫుడ్ కోర్టులు, బిర్యానీ సెంటర్లలో ఇదే దారుణమైన పరిస్థితి దాగి ఉందనేది బహిరంగ రహస్యం. కేవలం ఏసీ రూములు, ఖరీదైన సోఫాలు, ఆకర్షణీయమైన వెలుతురును చూసి మోసపోవద్దు. మీరు ఆర్డర్ చేసే ఆహారం మీ ఆరోగ్యానికి ఇంధనంగా మారుతోందా, లేక హాస్పిటల్ బెడ్‌కి దారి తీస్తోందా అనేది గమనించాలి. ఫుడ్ సేఫ్టీ అధికారులు కేవలం నోటీసులు, లైసెన్స్ సస్పెన్షన్లతో సరిపెట్టకుండా, ప్రజల ప్రాణాలతో ఆడుకునే ఇలాంటి హోటల్ మాఫియా క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పైన మెరుపులు లోపల పురుగులు ఇది మన హైటెక్ సిటీలో హోటల్ పరిస్థితి. ఇప్పటికైనా ఐటీ ఉద్యోగు ప్రజలు ఆలోచించుకోవాలి తాము రెస్టారెంటులో భోజనం చేసేవారిని భయపెట్టి ఉద్దేశం లేదని అయితే ప్రతి కస్టమర్ తాము తింటున్న భోజనం ఎంత శుభ్రంగా ఆరోగ్యకరంగా ఉందో లేదో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరిస్తున్నారు.



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వినతి పత్రం అందిస్తున్న హోంగార్డ్స్ సంఘం సభ్యులు

# ఖాకీతో సమానంగా విధి నిర్వహణ.. కానీ బతుకుల్లో మాత్రం చీకట్లే!

**హోంగార్డులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం వినతి**

**శేరిలింగంపల్లి : జూలై12,(నమస్తే ఉదయం)**

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో అడుగడుగునా అడుగులు వేస్తూ.. తుఫాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలైనా కరోనా వంటి ప్రాణాంతక విపత్కర పరిస్థితులైనా ప్రాణాలను పణంగా పెట్టి విధుల్లో ముందుంటున్నారు హోంగార్డులు. పోలీసులతో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ వారి శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదు. దశాబ్దాలుగా సమాజ రక్షణలో భాగస్వాములవుతున్న హోంగార్డుల పట్ల వివక్ష చూపడం అన్యాయమని వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించేలా చట్టంలో అవసరమైన మార్పులు తీసుకురావాలని కోరుతూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి సంఘం ప్రతినిధులు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.

**70 ఏళ్లుగా కొనసాగుతున్న శ్రమదోపిడీ!**

సంఘం అధ్యక్షుడు పుప్పాల అశోక్ ఆధ్వర్యంలో సమర్పించిన ఈ వినతిపత్రంలో హోంగార్డుల దయనీయ స్థితిని వివరించారు. దేశవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల మంది హోంగార్డులు రాత్రింబగళ్లు కష్టపడుతున్నప్పటికీ ఇప్పటికీ వారిని కేవలం వాలంటీర్లు గానే పరిగణించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 70 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ వాలంటీర్ వ్యవస్థ కారణంగా హోంగార్డులు తీవ్ర శ్రమదోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు.

**ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరవు**

శాశ్వత ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, సరైన సంక్షేమ సౌకర్యాలు లేకపోవడంతో అనేక మంది హోంగార్డుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హోంగార్డుల ఆర్థిక పరిస్థితులు, వారి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమల్లో ఉన్న పాత విధానాన్ని పూర్తిగా మార్చాలని కోరారు. ముఖ్యంగా బ్రిటిష్ కాలం నాటి స్వాతంత్ర్య సమయం నాటి 1946--47, అలాగే 1962--63 నాటి హోంగార్డ్ చట్టాల్లో తక్షణమే సవరణలు తీసుకువచ్చి, వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

**కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశ**

తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం చేసిన ఈ న్యాయమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని సంఘం నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన వారిలో హోంగార్డ్ ఆఫీసర్స్ నారాయణ రెడ్డి, నర్సింగ్, జంగయ్యతో పాటు పలువురు సంఘం ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.




# సిపిఎస్ రద్దుకై జరిగే 'జన జాగరణ యాత్ర'కు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సంపూర్ణ మద్దతు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 12 (నమస్తే ఉదయం)**

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓ పి ఎస్) పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈ నెల జూలై 17న నిర్వహించబోయే జన జాగరణ యాత్ర"కు జోగులాంబ గద్వాల జిల్లాలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. టి ఎస్ పి ఎస్ ఈ యు జోగులాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జూలై 17వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గద్వాల పాత బస్టాండ్ వద్ద గల వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో ఈ యాత్ర ప్రారంభం కానున్నది. ఈ మేరకు ఈ జన జాగరణ యాత్రకు ఎస్ టి యు టి ఎస్, ఎన్జీవో, టిపి యూఎస్, టి టి యు, పి ఆర్ టి యు, ఎస్జి టి యు, టీపీఎస్ఎ, డి పి ఆర్ టి యు, జిటిఏ, యుటిఎఫ్, బీసీటీ ఎ , టి ఎస్ టి యు, గిరిజన ఉపాధ్యాయ సంఘం, పిఎస్ హెచ్ఎం (గా ఎవీ), మరియు ఐఖీ తదితర సంఘాలు తమ సంఘీభావాన్ని తెలియజేశాయి.సిపిఎస్ ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి తోడుగా నిలుస్తూ.. ఈ యాత్రలో తామంతా ప్రత్యక్షంగా పాల్గొంటామని ఆయా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులంతా ఎలాంటి మినహాయింపు లేకుండా భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




# గద్వాలలో ముగిసిన 1వ వుషు సాండా స్టేట్ కప్ పోటీలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 12(నమస్తే ఉదయం)**



గద్వాల జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 1వ వుషు సాండా స్టేట్ కప్ (బాయ్స్ అండ్ గర్ల్స్) క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మెడల్స్, బహుమతులు అందజేశారు. గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ... "రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల జట్లు ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచాయి అని అన్నారు. సినిమాలో చూసే ఫైట్స్ లాంటి ఈ క్రీడను గద్వాలలో చూడడం సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి అని, క్రీడల వల్ల మానసిక దృఢత్వం, జ్ఞాపకశక్తి పెరుగుతాయి అని అన్నారు ఈ కార్యక్రమంలో గద్వాల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తుమ్మల నరసింహులు, పూడూర్ కృష్ణ, మోసిన్, బొట్టు సుధాకర్, ఇసాక్, రామాంజనేయులు, నాగేంద్ర యాదవ్, వినోద్, కిరణ్, కిట్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి హత్య కేసులో నిందితుడు అరెస్ట్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 12(నమస్తే ఉదయం)**

గద్వాల పట్టణంలోని బీసీ కాలనికి చెందిన శంకరమ్మ(60) అనే వృద్ధ మహిళను అమెకు వరుసకు కొడుకు అయ్యే అంజనేయులు అనే వ్యక్తి కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. మృతురాలి కూతురు జయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని ఈదారుణానికి ఒడిగట్టినట్లు విచారణలో తేలింది. హత్య కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తెలిపారు.



# వసంతనగర్ డివిజన్ డ్రీమ్ వ్యూ కాలనీలో బండి రమేష్ గారి పాదయాత్ర

**సమస్యల పరిష్కారానికి త్వరితగతిన పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన బండి రమేష్**

**కూకట్ పల్లి, జూలై 12 (నమస్తే ఉదయం)**

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ వసంతనగర్ డివిజన్ పరిధిలోని డ్రీమ్ వ్యూ కాలనీలో ఆదివారం ప్రత్యేక పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బండి రమేష్ స్థానిక ప్రజలను కలిసి, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ రవి విచ్చేసిన అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి, గౌరవపూర్వకంగా స్వాగతం పలికారు.

**కాలనీవాసుల సమస్యలు -- నాయకుల స్పందన**

పాదయాత్రలో భాగంగా కాలనీవాసులు తమ పరిధిలోని పలు సమస్యలను బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రధాన డ్రైనేజ్ వ్యవస్థ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అనేక ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రయాణించడానికి మహిళలు, వృద్ధులు అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిని, ప్రయాణానికి వీలు లేకుండా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసుల సమస్యలను ఎంతో ఓర్పుగా విన్న బండి రమేష్ సానుకూలంగా స్పందిస్తూ... ప్రధాన డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు సంబంధిత అధికారులతో తక్షణమే సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, అవసరమైన చోట్ల వీధి దీపాలను ఏర్పాటు చేయించి, దెబ్బతిన్న అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన ప్రారంభించేలా ప్రత్యేక కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ వ్యూ కాలనీలో ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ పాదయాత్రలో నాయకులు తూము వేణు, శ్రీనివాస్ బాబు, గాలి బాలాజీ, దినేష్ కుమార్,శివ చౌదరి, రంగమోహన్, గోపాల్ చౌదరి, చావా శ్రీనివాస్,సంధ్య, రజిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ మాయమాటలను నమ్మొద్దు







**బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పాలమూరు ఎంపీ డీకే అరుణ**

**ఎంపీ డీకే అరుణ సమక్షంలో భారీగా బీజేపీలో చేరిన యువత**

**కేంద్ర నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి.. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పుల పాలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 12(నమస్తే ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డీకే బంగ్లాలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు యువకులు ఎంపీ డీకే అరుణ సమక్షంలో కాషాయ కండువా కప్పుకుని బీజేపీలో చేరారు.

**ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ...**

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అంతర్గత అవగాహనతో (అండర్‌స్టాండింగ్ పాలిటిక్స్) నడుస్తున్నాయని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'సర్' (గా×=) కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకొని పనిచేయాలని, బోగస్ ఓట్ల తొలగింపుపై ప్రతి కార్యకర్త ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ఎండగట్టేందుకు ప్రణాళికాబద్ధంగా పోరాటాలు చేయాలన్నారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనపై ధ్వజం**

బీఆర్ఎస్ హయాంలో ఒకే కుటుంబం అవినీతి చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పై స్థాయి నుండి కింది స్థాయి వరకు అవినీతి రాజ్యమేలుతోందని దుయ్యబట్టారు. కమిషన్లు చెల్లించకపోతే కాంట్రాక్టర్లకు బిల్లులు రాని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమవుతోందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం పైసా కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను మాయ చేయడానికి అబద్ధపు హామీలు, జూట మాటలతో సిద్ధమవుతోందని, ప్రజలను చైతన్య పరిచి కాంగ్రెస్ మాయలో పడకుండా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

**డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి**

తెలంగాణలో భవిష్యత్తులో బీజేపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, డబుల్ ఇంజన్ సర్కార్ తోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. ప్రజా సమస్యలపై పోరాడకపోతే తెలంగాణ మరింత అంధకారంలోకి, అప్పుల కూపంలోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

**పాల్గొన్న ముఖ్య నాయకులు:**

ఈ సమావేశంలో జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి, మాజీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు అఫ్సర్ పాషా, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకటరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కేకే రెడ్డి, శ్యామ్ రావు, నాయకులు బలిగేరా శివారెడ్డి, రాజగోపాల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు